01ATP22_01ATP22.qxd 05-10-2024 PM 10:53 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 06 అక్టోబర్ 2024 | పేజీలు : 04


## ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు ముందంజ... మంత్రి సవిత



సభలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ, అక్టోబర్ 05 ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ఉద్యోగ కల్పన అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందంజలో ఉంటారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. నియోజకవర్గం కేంద్రమైన పెనుకొండ పట్టణంలో వివేకానంద జూనియర్ కళాశాలలో శనివారం డిఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం జరిగినసభలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో నిరఉద్యోగ యువతకు మంచి రోజులు వచ్చాయని, బాబుతోనే జాబు వస్తుందని, యువత నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చే దిశగా అడుగు లేస్తున్నారన్నారు. అయిదేళ్లలలో 25లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె అన్నారు. బీసీ స్టడి సర్కిళ్ల ద్వారా డిఎస్సీ కోచింగ్ సెంటర్ల నెలకొల్పారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనంతపురంలో బీసీస్టడి సర్కిల్ ఉందని, అక్కడే గతంలో డిఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రాంత విద్యార్థుల కోసం పెనుకొండలోనే నెలకొల్పడం జరిగిందన్నారు. ఒక్కో అభ్యర్థికి స్టైఫండ్ నెలకు రూ.1500, పుస్తకాల కోసం రూ.1000, రెండు నెలల పాటు డిఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నామని, నిరుద్యోగ యువకులు సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నిర్మలజ్యోతి, ఆర్డీఓ టి.ఆనంద్‌కుమార్, డిఎస్పి వెంకటేశ్వర్లు, ఏఎల్వో సత్యనారాయణ, ఎస్‌డబ్ల్యూఓ గంగాధర, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మాజీ ఎంపిపి కేసవయ్య, మండల కన్వీనర్ సిద్దయ్య, టిడిపి నాయకులు త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే చంద్రబాబు లక్ష్యం



అన్నా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం, అక్టోబర్ 05 ప్రభాతవార్త:**
ప్రజా ఆశీస్సులతో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో లక్షలాది మంది పేద ప్రజల ఆకలిని తీర్చడమే తెలుగుదేశం పార్టీ ముఖ్య లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రాణిసంత్రంలో అన్నా క్యాంటిన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నా క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నక్యాంటిన్‌లో పేద ప్రజలకు అన్నం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నా క్యాంటింన్లు ఇప్పటికే 175కేంద్రాలల్లో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూతపడిన అన్నా క్యాంటిన్లను పునఃప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు పట్టెడు అన్నం పెటాలన్న సంకల్పంతో అన్నా క్యాంటింన్లను పునఃప్రారంభించిన విషయం వైసిపి నాయకులు కనువింపు కలగాలని పేర్కొన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటిన్లను గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వం మూసివేసిందని, దీంతో లక్షలాది మంది పేదల కడుపుకొంట్టిందని మండిపడ్డారు. దుర్మార్గపు పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడి చంద్రబాబుకు పట్టం కట్టారన్నారు. చంద్రబాబునాయుడు ప్రజా రంజకమైన పాలన సాగిస్తున్నాడని పేర్కొన్నారు. భారతదేశంలోనే ఆంధ్రరాష్ట్రంను ఆగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గం అద్యక్షుడు కరేగౌడ మంజునాథ, మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి, తెదేపా పట్టణాద్యక్షుడు రాజు, గార్మెంట్ అసోసియేషన్ అద్యక్షుడు టంకశాల హనుమంతు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ బంగి శంకర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కడ్డిపుడి మహబూబ్‌బాషా, కౌన్సిలర్లు ప్రశాంతి, పద్మజ, మాజీ కౌన్సిలర్లు బండి భారతి తదితరులు పాల్గొన్నారు.



పేద ప్రజలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాలవ

# నమ్మిన వారికే శఠగోపం...!



టీచర్ బద్రీనాథ్



టీచర్ కాకర్ల దివాకర్ నాయుడు



రిటైర్డ్ టీచర్ కృష్ణమూర్తి

- రూ.కోట్లాది రుపాయిలు అప్పులు చేసి అండర్ గ్రౌండ్‌లోకి
- అప్పులు ఎగ్గొట్టేందుకు ఐపీ పెట్టిన వైనం
- ఇది ఆ ఐదుగురి అయ్యవార్ల బాగోతం
- అందులో ఇద్దరు సస్పెండ్, ఒకరు రిటైర్డ్
- మరొకరు చర్యలు నుంచి తప్పించుకోవడానికి వీఆర్‌కు దరఖాస్తు
- దరఖాస్తును తిప్పి వెనక్కి పంపించిన జిల్లా విద్యాశాఖ
- మరొకరు పంచాయతీ పెట్టి బెదిరిస్తున్న వైనం

**అనంతపురం న్యూటౌన్, అక్టోంబర్ 5 ప్రభాతవార్త**
సమాజంలో ఏ వృత్తికి లేని గౌరవం కేవలం ఒక్క ఉపాధ్యాయ వృత్తికి మాత్రమే వుంది. అలాంటి గౌరమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను నమ్మి అప్పులు ఇచ్చిన వారికే శఠగోపం పెట్టడం గమనార్హం. అందులో ఒకరు రిటైర్డ్ టీచర్ కాగా, మరో ఇద్దరు సస్పెండ్ అయ్యారు. మరొకరిపై పోలీసు కేసు నమోదు చేశారని బాధితులు వాపోతున్నారు. ఇంకొకరు అయితే అప్పులు ఇచ్చిన వారిపై బెదిరింపులకు దిగుతుండటం గమనార్హం.

జిల్లాలోని రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న టీచర్ రమేష్ అనధికారికంగా, అక్రమంగా చిటీలు నడుపుతూ... దాదాపు రూ.3 కోట్లతో పరార్ అయ్యారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు. దీంతో ఆయన్ను దాదాపు 11 నెలల క్రితమే సస్పెండ్ చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై వచ్చి హైదరాబాద్‌లోని తన నివాసం ఉంటున్నట్లు సమాచారం. అలాగే విడపనకల్లు మండలం హవళిగి జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న గణితం టీచర్ కె.బద్రీనాథ్ దాదాపు రూ.5 కోట్లు అప్పులు చేసి ఆ అప్పులు తీర్చలేక దాదాపు మూడు నెలల నుండి అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లారు. దీంతో నమ్మి అప్పులు ఇచ్చిన బాధితులు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. ఈ విషయంపై ఆ పాఠశాల హెచ్‌ఎం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రిపోర్టు పంపకపోవడంతో ఆయనపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. అయితే ఆ టీచర్ మాత్రం శాఖపరమైన చర్యలు నుంచి తప్పించుకోవడానికి వాలంటీర్ రిటైర్డ్ మెంట్ (వీఆర్‌ఎస్) కోసం దరఖాస్తును డీఈవోకు పోస్టు ద్వారా గత వారంలో పంపించినట్లు తెలిసింది. అయితే ఆ లెటర్‌కు సంబంధిత పత్రాలు జత చేయకపోవడంతో దానిని వెనక్కి పంపించారు. అంతే కాకుండా అనంతపురంలోని ఆర్‌ఎంహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న బయాలజీ టీచర్ కాక్ల దివాకర్ నాయుడు అనధికారికంగా గత కొంత కాలంగా చిటీలు, వడ్డీ వ్యాపారం చేస్తూ దాదాపు రూ.12 కోట్లు అప్పులు చేసి గత కొన్ని నెలలుగా ఎవరికి కనిపించకుండా అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అనంతపురం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లోఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో ఆయన్ను జిల్లా విద్యాశాఖ సస్పెండ్ చేసింది. అంతే కాకుండా తాడిమర్రి జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు టీచర్‌గా పనిచేసి మూడేళ్ల క్రితం పదవీ విరమణ పొందిన కృష్ణమూర్తి దాదాపు రూ.3 కోట్లు అప్పులు చేసి వాటిని తీర్చకుండా ఐపీ పెట్టడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అంతే కాకుండా జిల్లా కేంద్రంలో రాంనగర్‌లోని ఓ మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్ అక్రమ ఆదాయం కోసం పేద విద్యార్థుల చదువులను గాలికి వదిలేసి షేర్ మార్కెట్లో షేర్లు పెట్టడానికి దాదాపు రూ.కోటికి పైగా అప్పులు చేశారు. ఆ అప్పులు తీర్చాలని బాధితులు అడుగుతుంటే ఆయన ఓ పోలీసు అధికారిని ఆశ్రయించి వారి ద్వారా బాధితులను బెదిరిస్తున్నట్లు సమాచారం. రూ.లక్షకు రూ.10 నుంచి రూ.30 వేలు మాత్రమే ఇస్తాడని, ఇచ్చింది తీసుకోవాలని, లేదంటే మీరు కోర్టుకు వెళ్లండి, అంతే కానీ ఆ టీచర్ ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేస్తే మాత్రం మీరు ఖచ్చితంగా ఇబ్బంది పడుతారని ఆ పోలీసు అధికారి బాధితులను బెదిరించినట్లు సమాచారం. అయితే ఆ బెదిరింపులకు ఇద్దరు బాధితులు భయపడకుండా తాము కోర్టులో తేల్చుకుంటామని చెప్పి పంచాయతీ నుంచి వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ఇలా ఆ ఐదుగురు టీచర్లు పేద విద్యార్థుల చదువులను గాలికి వదిలేసి, అక్రమ సంపాదన కోసం అనధికారింగా, అక్రమంగా చిటీలు, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారం, షేర్ మార్కెట్లో షేర్లు పెట్టడం వంటివి చేస్తూ తమ వృత్తికే చెడ్డపేరు తీసుకువచ్చారు. వీరికే క్రమ శిక్షణ లేదు...ఇక విద్యార్థులకు ఏమి క్రమశిక్షణ నేర్పిస్తారని బాధితులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలా నమ్మిన వారికే ఆ ఐదుగురు టీచర్లు శఠగోపం పెట్టడం విద్యాశాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇవ్వాల్సిన అప్పు డబ్బులను వెనక్కి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### - గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం రావాలి - జిల్లా జడ్జి జి.శ్రీనివాస్



జడ్జి ఆధ్వర్యంలో కమీషనర్ నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 5 ప్రభాతవార్త**
అనంతపురం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ప్రధాన జిల్లా న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, డిఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్, అనంతపురం మున్సిపల్ కమీషనర్ జి.నాగరాజు ఆదేశాలతో న్యాయ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు కలిసి జడ్జి పర్యవేక్షణలో అనంతపురం కోర్టు ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సహకారం చేసే దిశగా ప్రతి భారతదేశ పౌరుడు శుభ్రత మీద అవగాహన వుండాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని మానవాళికి పర్యావరణం పట్ల అవగాహన, ప్రేమ, స్పృహ తప్పకుండా వుండాలని, అదేవిధంగా పర్యావరణం బాగుంటే సకాలంలో వర్షాలు పడి జీవ వైవిధ్యం బాగా వుంటుందని వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని వీటితో పాటు దేశ ప్రగతి కూడా జరుగుతుందని పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు ప్రతి ఒక్కరూ దూరంగా వుండాలని ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలియచేశారు.

ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ జి.నాగరాజును శాలువాతో సత్కరించి నగర ప్రజలకు మున్సిపాలిటీ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ జి.విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర, కార్యదర్శులు, మేస్త్రీలు శివకృష్ణ, చిరంజీవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హేమావతిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

### - భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి



విశేష పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



భూమిపూజ చేస్తున్న దృశ్యం

**అమరాపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త**
మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అన్ని హంగుల్లో అభివృద్ధి చేస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. హేమావతి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 12 లక్షల రూపాయలతో సౌచాలయం, స్నానపు గదుల ఏర్పాటుకు శనివారం సాయంత్రం భూమిపూజ చేశారు. సిద్ధేశ్వరస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందచేసి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి దేవాలయాల్లో ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సి విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్థానిక నాయకులు వారికి ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా పురాతన దేవాలయమైన అక్కచెల్లెళ్ల దేవాలయం, గంగామాలమ్మ దేవాలయంలో కూడా విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ రాష్ట్రసాధికారిక టిడిపి అధ్యక్షులు రొళ్ల విఎం పాండురంగప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మనుమనాయక్, ఎంపిడిఒ రామారావు, ఎఇ హరీష్, గ్రామ కార్యదర్శి నరేష్‌బాబు, మాజీ జెడ్‌పిటిసి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, నాయకులు శివరుద్రప్ప, ఎస్‌సి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, కుమారస్వామి, శివకుమార్‌యాదవ్, మారుతిప్రసాద్, దాదాపీర్, విశ్వేశ్వర, నాగోనపల్లి మంజునాథ్, గురుసిద్ధప్ప, జయరామప్ప, ఓంకార్‌స్వామి, తిప్పజ్జ, శివకుమార్, శివన్న, తిప్పేస్వామి, కృష్ణమూర్తి, బంగారుపాళ్యం తిప్పేస్వామి, చంద్రప్ప, కరేగౌడ్, గౌడరంగప్ప, డాక్టర్ శివానంద్, దయానంద్, చంద్రశేఖర్‌గుప్తా, రామచంద్రప్ప, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పాడిరైతుకు వరం



లబ్ధిదారుడు మంజునాథ్‌తో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 05, ప్రభాతవార్త ప్రతినిధి:**
నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పాడి రైతులకు వరమని ఈ కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ కోరారు. శనివారం పుట్టపర్తి రూరల్ పరిధిలోని పైపల్లిలో పాండవ గొర్రెల పెంపక కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి లబ్ధిదారుడు పి.మంజునాథ్‌ను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిసిడ్తున్న లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకం లబ్ధిదారులతో కలెక్టర్ ముచ్చటించారు. జిల్లాలోని పాడిరైతులందరూ నేషనల్ లైవ్ స్టాక్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలనిపిలుపునిచ్చారు. ఎన్‌ఎల్‌ఎం పథకం ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి, జంతు ఉత్పాదకతను పెంచుతుందన్నారు. గొడుగు పథకం అభివృద్ధి కార్యక్రమం క్రింద మాంసం, మేక పాలు, గుడ్డు, ఉన్ని ఉత్పత్తిని పెంచడమే లక్ష్యమని, అదనపు ఉత్పత్తి దేశీయ డిమాండ్లను తీర్చిన తరువాత ఎగుమతి ఆదాయానికి సహాయ పడుతుందన్నారు. లబ్ధిదారుడు మంజునాథ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ, సుమారు ఎకరం పొలంలో షెడ్లు నిర్మించుకొని కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా 2023 సంవత్సరంలో లీడ్ బ్యాంకు ద్వారా సుమారు కోటి రూపాయల రుణం తీసుకున్నానని, 525 గొర్రెలు, పొట్టేళ్ళు కొనుగోలు చేయడానికి రూ.50 లక్షలను సబ్సిడీతో రుణంగా పొందానన్నారు. సుమారు నెలకు రూ.10 వేల చొప్పున ఆదాయం పొందుతున్నానని, కొత్తచెరువు, పుట్టపర్తి, గొరంట్ల, ధర్మవరం, బెంగుళూరు, చెన్నై నగరాలకు ఇక్కడి నుండి పొట్టేళ్ళు రవాణ చేస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ రూపంలో పశుగ్రాసం అందిస్తున్నారని, ఈ పరిశ్రమ ద్వారామరో 5 మందికి తాను ఉపాధి చూపుతున్నట్లు తెలియజేశారు. పశు వైద్యాధికారి వారానికి 3 పర్యాయాలు గొర్రెల పెంపక కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, పశువైద్యాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## 7 వతేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక



**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 5 ప్రభాతవార్త**
ఈ నెల 7వతేదీ సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుండి 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్‌కు సంబంధించి నగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలో ఈ నెల 7వతేదీన ఉదయం 9 నుండి 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అనంతపురం అర్బన్, రూరల్ మండలాల ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మీరైనా మేమైనా ప్రజల కోసమే ఉన్నాం

- బదిలీపై వచ్చిన అధికారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత
- ప్రజలకు ఏ సమస్య వచ్చినా వేగంగా స్పందించాలి
- మీరు సహకరిస్తే రాప్తాడు నియోజకవర్గ అభివృద్దే సాధ్యం
- అనంతపురం క్యాంపు కార్యాలయంలో అధికారుల సందడి





రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న అధికారులు

**అనంతపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త బ్యూరో**
ప్రభుత్వ అధికారులుగా మీరైనా.. ప్రజా ప్రతినిధులుగా మేమైనా ఉన్నది ప్రజల కోసమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తాజాగా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు, రాప్తాడు నియోజకవర్గానికి బదిలీపై వచ్చిన అధికారులు ఎమ్మెల్యే సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్ద ఎత్తున అధికారులు, ఇతర సిబ్బంది రావడంతో అనంతపురం క్యాంపు కార్యాలయంలో సందడి కనిపించింది. ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కూడా అధికారులు కలిశారు. జిల్లా పంచాయితీ రాజ్, ఎక్సైజ్ విద్యుత్ శాఖల అధికారులతోపాటు ఎంపిడిఓలు, ఈఓఆర్డీలు, పంచాయితీ సెక్రెటరీలతోపాటు పలువురు ఎమ్మెల్యే సునీతను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సునీత విభాగాల వారిగా అధికారులతో సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై చర్చించారు. ఈ ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. మనందరం ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలన్నారు. వారు వివిధ సమస్యలతో కార్యాలయాలకు వచ్చినప్పుడు, మర్యాద పూర్వకంగా మెలగాలని, అలాగే పార్టీలు అస్సలు చూడవద్దన్నారు. ముఖ్యంగా రైతులు విద్యుత్ పరంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎక్కడ మీకు సమస్యలు ఎదురైనా తన దృష్టికి తసీఉకురావచ్చని, కచ్చితంగా మీకు ఎలాంటి ఇబ్బందులు లేని వాతావరణం నియోజకవర్గంలో ఉంటుందని సునీత స్పష్టం చేశారు.

02ATP27_02ATP27.qxd 05-10-2024 PM 10:32 Page 1



# గంగమ్మ వంక ఉధృతం స్థంభించిన రాకపోకలు

డి.హీరేహాళ్, అక్టోబర్ 05 ప్రభాతవార్త:


ఉధృతంగా ప్రవహిస్తున్న గంగమ్మ వంక...


సోమలాపురం ఎస్సీ కాలనీ వాసులతో ఎంపిటిసి

కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్ మండలం ఎగువ భాగాన కర్ణాటక పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షంకు వంకలు, వాగులు పొరలిపొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పాడింది. డి.హీరేహాళ్ మండల పరిధిలోని సోమలాపురం గ్రామం వద్ద ఉన్న గంగమ్మ వంక ఉధృతంగా ప్రవహించడంతో శనివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు స్థంబించి వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయి బారులు తీరాయి. మండల పరిధిలోని హీర్దేహాళ్ ఎల్లమ్మ వంక, పులకుర్తి వంకలు, గవిసిద్దేశ్వర వాగు ఉధృతంగా ప్రవహించడంతో మల్లికేతి చెరువుతో పాటు ఆ వంకలపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. భారీ వర్షంకు సోమలాపురం ఎస్సీ కాలనీ నీట మునిగి ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఆహార ధాన్యాలు, వంట సామాగ్రి ఇతర వస్తువులు తడిసి ముద్దాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎంపిటిసి మొండి మల్లికార్జున ఎస్సీ కాలనీకి చెరుకొని పరిస్థితిని పరిశీలించి బాధిత కాలనీవాసులను పరామర్శించి సంఘటన విషయం చరవాణి ద్వారా స్థానిక అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వెంటనే స్పందించి అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థను వెంటనే పునర్నిర్మించి కాలనీవాసుల ఇబ్బందులు తొలగించి తిరిగి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ఆయన అధికారులను కోరినట్లు మీడియాకు సమాచారం అందించారు.

# విరాళం వితరణ.... వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

డి.హీరేహాళ్, అక్టోబర్ 05 ప్రభాతవార్త:


విరాళం అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప గంగమ్మ దేవాలయం నిర్మాణంకు విరాళం వితరణ చేశారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి కళ్యాణమండపంలో ఆ సేవాసమితి ఉపాధ్యక్ష/డు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, పలువురు సభ్యులతో కలిసి రూ.5,100లు విరాళం ఇచ్చారు. గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర గ్రామానికి చెందిన బెస్త సమాజిక వర్గానికి చెందిన శ్రీరాములతో పాటు ఆ ఆలయ కమిటి సభ్యులు నాగేంద్ర తదితరులు గంగమ్మ దేవి ఆలయ నిర్మాణం విషయమై వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులకు వివరించడంతో ఆయన అందుకు సమ్మతించి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సేవాసమితి మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, సభ్యులు అజయ్‌టైలర్ రఘు, ఎలక్ట్రిషన్ సిద్దప్ప, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# కోతకు గురైన రహదారి.. స్పందించిన క్లస్టర్ ఇన్‌చార్జ్

డి.హీరేహాళ్, అక్టోబర్ 05 ప్రభాతవార్త:


వర్షంకు కోతకు గురైన రహదారి

మండలంలో శుక్రవారం రాత్రి నుండి శనివారం వేకువ జాము వరకు కురిసిన భారీ వర్షంకు దొడగట్ట ప్రధాన రహదారి కోతకు గురై రాకపోకలు స్థంబించాయి. శనివారం ఉదయం కోతకు గురైన రోడ్డును గమనించిన ప్రయాణికులు డి.హీరేహాళ్


కోతకు గురైన రహదారికి మరమ్మత్తులు చేస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జ్

మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పాటిల్ మోహన్‌రెడ్డి, తెదేపా నాయకుడు రామాంజినేయులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన క్లస్టర్ ఇన్‌చార్జ్ తక్షణం జెసిబితో ఆ రహదారికి మరమ్మత్తులు చేయించి ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యం కల్పించారు. కోతకు గురైన చోట రహదారికి కల్వర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాదనహాళ్, కాదలూరు, దొడగట్ట, గ్రామస్థులతో ప్రయాణికులు తెలిపారు. గతంలో రహదారి నిర్మాణానికి నివేదికలు తయారుచేసి అధికారులు రూ.5లక్షల నుండి రూ.6లక్షల వరకు నిధులు సమకూర్చి ఉంటే ఈ ఘటన చోటుచేసుకుని ఉండేది కాదని స్థానికులు చెప్పారు. ఈ రహదారికి ఎలుకలు బొరియలు వేయడంతో రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు బొరియల్లో చేరి రహదారి కోతకు గురైందని స్థానికులు తెలిపారు.

# ముప్పలకుంటలో ట్రాక్టర్‌బోల్తా ఇద్దరు యువకులు మృతి

బ్రహ్మసముద్రం అక్టోబర్ 05 ప్రభాతవార్త,


బోయ వన్నూరుస్వామి ఫైల్ ఫోటో, గొల్ల లక్ష్మీకాంత ఫైల్‌ఫోటో

మండలంలోని ముప్పలకుంటలో ట్రాక్టర్‌బోల్తాపడి ఇద్దరు యువకులు మృతిచెందారు. ముప్పలకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (19), లక్ష్మీకాంత (20) ఇద్దరు వ్యావసాయ పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతున్న సమయంలో వర్షం రావడంతో ఇంటికి బయలుదేరి వస్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పిబోల్తాడి అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరిని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండవ దశను ప్రారంభించిన భాజపా నాయకులు

కుందుర్పి, అక్టోబర్ 5 ప్రభాతవార్త


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బిజెపి నాయకులు

కుందుర్పి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండవ దశను ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార య్రక్రమం మొదటి దశ పూర్తి చేసుకుని, రెండవ దశ ఈ నెల 17 వరకు కొనసాగనుందని భారతీయ జనతా పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కుందుర్పి మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ కన్వీనర్ లిత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొఆన్నరు. మండలంలో జరిగిన మ ఒదటి దశ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి సమీక్ష సమావేశం నిర్వహించిన తర్వాత, రెండో దశలో కూడా కఆర్యకర్తలు సమిష్టిగా పనిచేసి భారతీయ జనతాపార్టీలోకి ప్రజలను ఆహ్వానించి ప్రాథమిక సభ్యత్వాలు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి లలిత్‌కుమార్ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అని 2014 తర్వాత ప్రధాని మోదీ నాయకత్వంలో గత 10 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి, ప్రయోజనాలే లక్ష్యంగా చేసుకుని భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు, నాయకులు పని చేస్తున్నారని, అందుకు ఫలితంగా భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని మరోసారి దేశ ప్రజలు ఎన్నుకున్నారని, కావున భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో కూడా బలపడాలన్న లక్ష్యంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రచార కార్యదర్శి ఆదినారాయణ, రాష్ట్ర ఎస్సీ మోర్చ కార్యదర్శి శాంతకుమార్, కళ్యాణదుర్గం కోకన్వీనర్ ఎస్.కె.గంగాధర్, మండల అధ్యక్షులు వెంకటేష్, కిసాన్ మోర్చా నాయకులు కణేకల్ భాస్కర్, ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు రవి, మండల ఉపాధ్యక్షులు జి.శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి కిష్టప్ప, కోశాధికారి వన్నూరుస్వామి, గంగాధర, హనుమంతు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

లేపాక్షి, అక్టోబర్ 5 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లేపాక్షి శ్రీదుర్గా వీరభద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి శనివారం అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం దుర్గాదేవి, వీరభద్రస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో వీరభద్ర ఆలయ అన్నదాన కమిటీ సభ్యులు రామాంజినేయులు, రాంప్రసాద్, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు, ఆలయ కార్యనిర్వాహాధికారి నరసింహమూర్తి, దేవాదాయశాఖ సహాయకులు మల్లికార్జున, పురావస్తుశాఖ సహాయకులు రాము, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతహీ సేవ

మడకశిర అక్టోబర్ 05 ప్రభాతవార్త;


స్వచ్ఛతహీ సేవలో కోర్టు సిబ్బంది

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఆర్.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం కోర్టు సిబ్బంది కోర్టు స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ ఉచిత సేవలు కొరకు సహాయ నంబర్ 15100 కు సంప్రదించవచ్చని మండల న్యాయసేవ సంఘం అధ్యక్షులు ఆర్.అశోక్‌కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బికె.మురళీకృష్ణ, సిద్దేశ్, భాగ్యలక్ష్మి, రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్, లాయర్లు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన ద్వారా మనిషికి మానసిక ప్రశాంతత

- చిదానంద భారతీస్వామీజీ

అమరాపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త


గురుపూజ దృశ్యం

మండల కేంద్రంలోని మాజీ ఎంపిపి మీనాక్షి రామిరెడ్డి స్వగృహంలో శనివారం గురుపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కర్ణాటక రాష్ట్రం సిరా తాలూకా పూజారి ముద్దనహళ్లి శ్రీసిద్ధరూడ ఆశ్రమ పీఠాధిపతులు పరమ పూజ శ్రీచిదానంతభారతీస్వామీజీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి మాజీ ఎంపిపి మీనాక్షి రామిరెడ్డిలతో పాటు భక్తులు గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మనిషికి మానసిక ప్రశాంతత పొందవచ్చున్నారు. అదేవిధంగా జీవితంలో ప్రతి ముఖ్యమైంది జ్ఞానమని, ఆ జ్ఞానబోధనను గురు రూపంలో పొందవచ్చునాన్రు. విశ్వసృష్టిలో గురువును మించిన దైవం లేదని మనిషి మనుగడ గురువు ద్వారానే ప్రారంభమవుతుందని స్వామీజీ పేర్కొన్నారు. అదేవిధంగా అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ధర్మవరం డివిజన్‌లో పంట నమోదు పరిశీలించిన అధికారులు

ధర్మవరం, అక్టోబర్ 5 ప్రభాతవార్త


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్‌లోని ధర్మవరం మండలం, సికెపల్లిమండలం, రామగిరి మండలాల్లో పంట నమోదు వివరాలు తనిఖీ నిర్వహించారు. సాగు చేసిన పంట విస్తీర్ణం, సాగు వివరాలు నీటిపారుదల పద్ధతి మొదలైన వివరాలు పరిశీలించారు. పంట నమోదు చేసుకున్న వారందరూ ఈకెవైసి చేయించుకోవాల్సింది గా సూచిచడం జరిగిందన్నారు. పంట నమోదు, ఈ కెవైసి చేయించుకున్న వారు ప్రభుత్వ పథకాలకు అర్హులని, ఈ కార్యక్రమంలో ఇడియం నరేంద్ర, వ్యవసాయ అధికారి ముస్తఫా, విఏఏలు త్రినాథ్, శ్రీనివాసులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



# ఆలయ గోపురానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, అక్టోబర్ 05 ప్రభాతవార్త:


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు..

పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ దశభుజ గణపతి ఆలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నూతన గోపురం నిర్మాణంకు శనివారం స్థానిక


స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలవ

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న దశభుజ మహాగణపతికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎంతో మహిమాన్వితమైన దశభుజ గణపతి ఆలయంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురంకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. నూతన హంగులతో ఆలయ గోపురాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గార్మెంట్ అసోసియేషన్ అద్యక్షుడు టంకశాల హనుమంతు, ఆటయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా పడి ఒకరు మృతి నలుగురికి స్వల్ప గాయాలు

కణేకల్లు, అక్టోబర్ 05 ప్రభాత వార్త:


ప్రమాదంలో మృతి చెందిన కురుబ ఎర్రిస్వామి

ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందగా నలుగురు స్వల్ప గాయాలు తగిలిన సంఘటన శనివారం నల్లంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఆదిగాని పల్లికి చెందిన కురుబ ఎర్రిస్వామి శనివారం నల్లంపల్లి వద్ద ఆటో బోల్తా పడి మృతి చెందాడు అని తెలిపారు. స్థానికులు ఆదిగాని పల్లికి చెందిన కురుబ ఎర్రిస్వామి తన భార్య అనారోగ్యం ఉండడంతో కనేకల్లు క్రాస్ నుండి రాయదుర్గానికి మందుల కోసం వెలుతుండగా నల్లంపల్లి వద్ద ఆటో బోల్తా పడి ఆటోలో ప్రయానిస్తున్న నలుగురుకు స్వల్ప గాయాలు కాగా ఎర్రిస్వామిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు స్థానాకులు తెలిపారు. మృతుడు కురుబ ఎర్రిస్వామికి ఇద్దరు కుమారులు ఇద్దరు కూతుర్లు కలరని కుటుంబ పెద్దదిక్కుకోల్పోవడంతో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# వ్యాధి నిరోదక టీకాలపై అవగాహన కార్యక్రమం

పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 05 ప్రభాతవార్త

వ్యాధి నిరోధక టికాలపై అవగాహన కార్యక్రమాన్ని పుట్టపర్తి ప్రశాంతి గ్రామం నందు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, చిన్న పిల్లలకు ఇచ్చు వ్యాధి నిరోధక టికాలపై అవగాహన కల్పించారు. గర్భవతులు తరచు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారము తీసుకోనవలయు నని. సకాలములో వ్యాధి నిరోధక టికాలు వేయించుకొని, ఆసుపత్రిలోనే కాన్పు చేయించు కోవాలని, బిడ్డకు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, వ్యాధి నిరోధక టికాలు సకాలంలో వేయించి పుట్టిన ప్రతి శిశు ఆరోగ్యముగా ఎదగవలయుననిం ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత శుభ్రత పాటించి, పౌష్టికాహారం తీసుకొవడం వలన సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఎంపిహెచ్ఈఓ గఫూర్, ఆరోగ్య కార్యకర్త అమృత, ఆశా కార్యకర్త అనిత పాల్గొన్నారు.

# అన్నపూర్ణదేవి అలంకరణలో వాసవిమాత

కొత్తచెరువు అక్టోబర్ 05 ప్రభాతవార్త



శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. వీటిలో భాగంగా మొదటిరోజు బాలాత్రిపుర సుందరిదేవి అలకంరణలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రెండవ రోజు శుక్రవారం గాయిత్రి దేవి అలకంకరణలో దర్శనమిచ్చారు. మూడవరోజు అన్నపూర్ణదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారని అలంకరించారు. అమ్మవారికి పురోహితులు అర్చకులు పూజ నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తాదులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థప్రసాదాలను స్వీరించారు.

# వి ఏ ఓల బకాలయిలు వెంటనే చెల్లించాలి- సిఐటియు


విఓఏ ప్రజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు.

పుట్టపర్తి రూరల్, అక్టోబర్ 05 ప్రభాతవార్త.

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న విఓఏ లకు 5నెలల బకాయి వేతనాలు చెల్లించి రాజకీయ అక్రమ తొలగింపులు అదికారుల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా సత్యసాయి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఓఏ లకు 2024 మే నెల నుండి ఉన్న బకాయి వేతనాలు చెల్లించాలని. ఇప్పటి వరకు వేతనాలకు సంబందించిన అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని ఆర్థిక ఇబ్బందుల నుండి విఓఏ కుటుండాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత 2 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మందిన తొలగించారు. మరి కొంతమందిని తొలగించడానికి లిస్టులు తయారు చేసి ఉద్యోగం నుండి తొలగిపోవాలని వేధిస్తున్నారన్నారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుధన్దంగా విఓఏ ల అక్రమ తొలగింపుకు పాల్పుడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లీగలన గానే హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు కూడా వెళ్లడం జరిగిందన్నారు. గ్రామ సమాఖ్య జనరల్ బాడీ నిర్వహించడం లేదని తీర్మానము లేకుండానే కొత్త మినిస్ట్ బుక్‌లో కొంతమంది మండల అధికారులే తీర్మానము రాసి గ్రామ సంఘం లీడర్లను మండల సమాఖ్యకు పిలిచి విషయం చెప్పకుండా సంతకాలు చేయించి సొంత వారిని తొలగించి, కొత్తవారిని నియమించి పని చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు విఓఏ సభ్యులు పాల్గొన్నారు.

# ఉగ్రనరసింహస్వామి అలంకారంలో వెంకటరమణస్వామి

హిందూపురం టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పట్టణంలోని శ్రీపేటా వెంకటరమణస్వామి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకుని శనివారం స్వామివారు ఉగ్రనరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో పల్లకి ఉత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా హిందూపురం వాసవిమాత ఆలయంలో అమ్మవారు కమలాంబిక అలంకరణలో కొలువుదీరారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

# శ్రీఅన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

చిలమత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని దిగువబస్టాండ్ శివాలయం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండే శోడశ ఉపచారపూజ, మధ్యాహ్న హారతి, లలిత సహస్రనామ పారాయణము, మహామంగళహారతి, సాయంత్రం అన్నపూర్ణదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు గరుడ వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందచేశారు. మండలంలో తొలిసారిగా విగ్రహ రూపంలో అమ్మవారు కొలువుతీరడంతో దర్శించుకునేందుకు గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా సందడిగా మారింది.

# పుట్టపర్తి అర్బన్ ఎసైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరాములు

పుట్టపర్తి టౌన్ అక్టోబర్ 05 ప్రభాతవార్త


అర్బన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీరాములు.

పుట్టపర్తి పట్టణ అర్బన్ ఎస్సైగా శనివారం శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానం చేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి అర్బన్ పరిధిలో గతంలో ఏఎస్సైగా విధులు నిర్వహించిన అనుభవం తనకు ఉందన్నారు. అలాగే శాంతి భద్రతను పరిరక్షణకు కృషిచేసి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి తనను కలవవచ్చని ఎస్సై పేర్కొన్నారు.

# కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం

కదిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక బాలికల పాఠశాల ఆవరణంలో శనివారం కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బందిచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతులుమీదుగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు కృషిచేసిన కన్వీనర్ నగేష్‌కు ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డిఎస్సీ ఉచిత శిక్షణ కార్యక్రమంలో, ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన నగేష్ సేవలు అభినందనీయమన్నారు. 22 సంవత్సరాలుగా పలు సేవా సమాజ కార్యక్రమాలు చేపడుతూ అందరినీ ఆకట్టుకుంటున్న నగేష్, భవిష్యత్తులో అన్ని విధాలా అండగా ఉంటామని, ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడిబండలో సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

గుడిబండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రామారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రామారావు మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, త్రాగునీరు, సిమెంట్ రోడ్లుకు ప్రాధాన్యత సర్పంచులకు పంచాయితీ కార్యదర్శిలకు సూచించారు. అలాగే వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖలో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామారావు, ఈఓఆర్డి నాగరాజునాయక్, ఎంపిపి రాధమ్మ, ఏఓ వీరనరేష్, సిడిపిఓ శాంతలక్ష్మి, సర్పంచులు కరుణాకర్‌గౌడ్, రంగస్వామి, తిప్పేస్వామి, లక్ష్మీనారాయణ, కవిత ఓబన్న, శివరు ద్రమ్మ, హనుమంతరాయప్ప, ఎంపిటిసిలు రామచంద్రప్ప, పుష్పలత, రాజన్న, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఏపీఓ భార్గవి, పంచాయితీ కార్యదర్శిలు ప్రకాష్, అమరేష్, కలందర్, అజయ్, హరీష్ తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు అమ్మ తొలిదైవం సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ఉరవకొండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం 6.30 గంటల నుండి అమ్మ తొలిదైవం సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ విద్యార్థులచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు పాటిల్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఇందిరా నగర్‌వద్ద దుర్గాభవాని అమ్మవారి మూర్తిను భక్తులు కొలువుదీర్చి నవరత్రా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. శాస్త్రీయ నృత్య ప్రదర స్శనకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

# పార్టీ గ్రూపులకు, వర్గాలకు తావులేదు.. ఎమ్మెల్యే దగ్గుపాటి

- సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమంలో దగ్గుపాటి కీలక వ్యాఖ్యలు
- పార్టీలో గ్రూపులు ఉన్నట్టు కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారు
- లక్షకు తగ్గకుండా సభ్యత్వ నమోదు చేస్తామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- పార్టీలో కష్టపడ్డ వారికి ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్



కార్యక్రమానికి హాజరైన టిడిపి నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం అర్బన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో లక్ష మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తె లిపారు. ఇవాళ అనంతపురం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటితో, జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, అనంతపురం నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, నాలుగు పంచాయితీల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ అధిష్టానం మనపై ఎంతో నమ్మకంతో పైలెట్ ప్రాజెక్టుగా మన నియోజకవర్గాన్ని ఎంపిక చేశారన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సభ్యత్వ నమదు రికార్డు స్థాయిలో జరిపించేలా కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. లక్షమందికిపైగా సభ్యత్వనమోదుచేసి రాష్ట్రంలోని అనంతపురం నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌కు ఇద్దరు చొప్పున పంచాయితీల్లో నలుగురు చొప్పున ఈ సభ్యత్వ నమోదుకు ఇన్ చార్జ్‌లుగా నియమిస్తున్నట్లు తెలిపారు.

**పార్టీలో గ్రూపులకు తావు లేదు.. ఇక్కడున్న టీడీపీగ్రూపు మాత్రమే :**

ఇటీవల కొంత మంది తెలుగుదేశం పార్టీలో గ్రూపులు ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంత మాత్రం వాస్తవం లేదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ తెలుగుదేశం పార్టీ ఆ గ్రూపు ఈ గ్రూపు లేదని ఉన్నది తెలుగుదేశం పార్టీ గ్రూపు మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారాలోకేష్ గ్రూపు మాత్రమే ఇక్కడ ఉంటుందన్నారు. పార్టీలో కష్టపడిన వారికి ఎప్పటికైనా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ అబ్జర్వర్, సివిల్ సప్లై కమిషనర్ డైరెక్టర్ లక్ష్మినారాయణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జెఎల్ మురళీధర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిలు గాజుల ఆదెన్న, రాయల్ మురళీ, పార్టీ సీనియర్ నాయకుడు గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మినరసింహులు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, బిసి సెల్ రాష్ట్ర అధికార ్రతినిధి దలవాయి వెంకటనారాయణ, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచిహరి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మినరసింహా, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైపుద్దీన్, బిసి సెల్ నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేష్, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, తెలుగుదేశం పార్టీ నాయకులు మధు రాయల్, బలిజ సంఘం రాయలసీమ యువజన అధ్యక్షుడు తొండనపాటి రమేష్, మాజీ కార్పోరేటర్లు రాజారావు, సరళ, రంగాచారి, మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, తెలుగుదేశం పార్టీ నాయకులు వన్నూరప్ప, వెంకటేశ్వరరెడ్డి, తమ్మినేని వేణుగోపాల్, ఇమామ్, చెరుకుతోట పవన్‌కుమార్, తెలుగు మహిళ నాయకురాలు వడ్డే భవాని, కంఠదేవి, సుమలత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## అభివృద్ధి సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం : ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు

**అగళి, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆర్‌జి హళ్లిలో నిర్మించిన సచివాలయ భవనాన్ని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులతోపాటు ఎమ్మెల్యే ఎంఎస్.రాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ భవన నిర్మాణాలు పదుల సంఖ్యలో నియోజకవర్గంలో నిలిచిపోయాయని, అయినా సర్పంచు రంగప్ప చొరవ తీసుకుని పూర్తి చేయడం హర్షదాయకమన్నారు. సచివాలయ భవనం రాష్ట్ర సచివాలయ భవనంతో సమానమని, గ్రామ పంచాయితీల్లో ఏ పనులు కావాలన్నా సచివాలయానికి వెళ్లాల్సి వస్తుందని, అందుకు దానిని సత్వరమే పూర్తి చేయడం సంతోష దాయకమని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి, ఇన్‌చార్జ్ దృష్టికి డ్రైనేజీలు విద్యుత్ సమస్యల గురించి తెలుపగా పరిష్కరిస్తామన్నారు. బొమ్మాసన పల్లి-కోడిపల్లి రోడ్డు, ఆర్‌జి హల్లి, హనుమనపల్లి రోడ్లను తారు రోడ్లుగా మార్చాలని నాయకుల దృష్టికి తీసుకెళ్లగా వారు హామీ ఇచ్చారు. గుండుమల మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హంద్రీనీవా నీళ్లను అన్ని చెరువులకు వదలాలని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులే తప్పా వైఎస్ఆర్‌సిపి వారు తట్టెడు మట్టిని వేయలేదని, అయినా ఆ కాలువ పనులను పూర్తి చేసి చెరువులను నీటితో నింపుతామన్నారు. అదే విధంగా రత్నగిరి రిజర్వాయర్, రాళ్లపల్లి రిజర్వాయర్లకు స్థల సేకరణ పూర్తి అయిందన్నారు. గాయత్రి కాలనీ, హుల్లెకెర పంచాయితీలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని బైపాస్ కెనాల్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. పెన్షన్లు, ఇళ్లను అర్హులకు అందిస్తామన్నారు. ఎంఎం పాళ్యం సమీపంలో ఉన్న ఇళ్ల స్థలాల్లో పెరిగిన కంప చెట్లను పరిశీలించి వాటిని తొలగించి అర్హులకు 3 సెంట్ల ప్రకారం స్థలాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, జడ్పిటిసి ఉమేష్, కెంచ యాదవ్ పిఆర్ ఇంజినీర్ నాగన్న, అబిజిత్, వేణు, కన్వీనర్ కుమారస్వామి, రఘు, లింగరాజు, రాజన్న, షౌకత్, నాగరాజు, భూతరాజు, రమేష్ టిడిపి నాయకులు హాజరయ్యారు.

# దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత వెంకటరమణ, జెడ్‌పిచైర్‌పర్సన్ గిరిజమ్మ



పూజల్లో పాల్గొన్న సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత వెంకటరమణ, జెడ్‌పిచైర్‌పర్సన్ గిరిజమ్మ

**అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనంతపురం అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు శనివారం అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలకు సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత వెంకటరమణ, అనంతపురం జిల్లా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలు ముఖ్యఅతిథులుగా హాజరై పూజల్లోపాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాలు అర్బన్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించడం చాలాశుభ పరిణామమన్నారు. వ్యాపారలావాదేవీలతో పాటు సామాజిక స్పృహకలిగివుండి సేవా కార్యక్రమాలతోపాటు ఇలాఉత్సవాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఆ అమ్మవారి కరుణాకృపదయతో జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఉత్తమ కో ఆపరేటీవ్ బ్యాంకుగా అభివృద్ధి చెందాలని పేద, మధ్య తరగతి కుటుంబాలకు బ్యాంకు రుణాలు అందించడం ద్వారా వారి ఆర్థిక పురోగతికి ఎంతో దోహద పడిందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రంనిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ మురళీధర్, వైస్‌చైర్మన్ వడ్డే వెంకటాద్రి, గోల్డ్ బాష, పాలకవర్గం సభ్యులు రోళ్ల భాస్కర్, మాగిశెట్టి చంద్రశేఖర్, కృష్ణకుమార్, బావిగడ్డి రమణయ్య, సుంకర రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్య అన్నింటి కంటే శక్తి వంతమైనది

- ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులను మరువ వద్దు
- అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ మహోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

విద్య అన్నింటికంటే శక్తి వంతమైనది, గొప్పది, చాలా ముఖ్యమైనది. ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయులను మరువ వద్దు, తల్లిదండ్రుల వద్దకన్నా విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దే సమయం ఎక్కువ గడుపుతున్నారు. సమాజం అభివృద్ధిచెందాలంటే ఉ పాధ్యాయ వృత్తిపై ఆధార పడిందని, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాలికల కళాశాలలో కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్



ఉపాధ్యాయురాలని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక ప్రాంత అభివృద్ధికైనా, దేశం అభివృద్ధికైనా దేశ నాగరికతకు ఒక చిహ్నంగా చూడాలంటే విద్య అనేది ఒక కొలమానంగా ఉంటుందన్నారు. విద్య అనేది ఒక ఉద్యోగానికో.. వృత్తి కోసమో అనేది కాదు, ఉన్నతమైనది, విలువలతో సమసమాజ స్థాపన కోసం హక్కుల పరిరక్షణ కోసం ఒక గౌరవ ప్రధానమైన విలువలతో కూడినటువంటిది అన్నారు. సమాజాన్ని ప్రపంచాన్ని అర్థం చేసుకోగల శక్తి విద్య ద్వారా మనిషి పొంద గలుగుతారన్నారు. అనంతరం కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డిఎస్సీ శిక్షణ తరగతుల్లో సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దుశ్శాలువాలు కప్పి పూలమొక్కలు అందించి వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగప్ప, శంకర, రంగయ్య, చెన్నకృష్ణ, ఓబులరెడ్డి, డిఎస్సీ కోచింగ్ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ బాబు, వెంకట రమేష్, పవన్‌కుమార్, సునీల్‌కుమార్‌లు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు

- ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త**



గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర నియోజకవర్గంలో ఇల్లు లేదు అన్న పేదవాడు ఉండకూడదని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. శనివారం రాత్రి ఆర్ అండ్ బి అతిథి గృహంలో రెవెన్యూ గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర మండలం గుండుమలగ్రామంలో పర్యటనసందర్భంగా నియోజకవర్గానికి పదివేల ఇల్లుకావాలనికోరారు. అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నియోజకవర్గంలో సంతృప్తి స్థాయిలో ఇల్లులేని పేదలందరికీ ఇల్లు కేటాయించాలని అన్నది మా లక్ష్యం అన్నారు. దసరా పండుగ అనంతరం గ్రామ గ్రామాన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇల్లు లేని పేదలను గుర్తించాలని ఆదేశించారు. ఏ ఒక్క చోట కూర్చుని డ్రైవ్ నిర్వహిస్తే పూర్తి సమాచారం రాదన్నారు. మడకశిర పట్టణంలో సైతం పేదల ఇళ్ల స్థలాల కోసం మడకశిర పట్టణ సమీపంలో 50 ఎకరాలు దాకా స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యమంత్రి సంతృప్తికర పాలన అందించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారని అందుకు గుణంగా తామందరూ కృషి చేద్దామని పలు సూచనలు చేశారు.

# పార్టీ బలోపేతం దిశగా ముందుకు రండి

- క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతలకు అనంత సూచన



అనంతను సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనార్టీసెల్ నేతలు

**అనంతపురం సిటీ, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

జిల్లాలో వైసీపీ బలోపేతం కోసం క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతలు ముందుకురావాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన అనంత వెకటరామిరెడ్డిని వైసీపీ క్రిస్టియన్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షులు వైపి.బాబు ఆధ్వర్యంలో పాస్టర్లుకలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ పాలనలో జరిగిన మేలును, టిడిపి పాలనలో జరుగుతున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలోపాస్టర్లు వాసు అనీల్‌కాంత్, అబ్రహం, సల్మాన్, జాకబ్, మానేషా తదితరులు పాల్గొన్నారు.

# చాబాల గ్రామంలో ట్యాంకర్లతో నీటి సరఫరా

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో టీడీపీ నాయకుల చొరవ

**ఉరవకొండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

వజ్రకరూరు మండల పరిధి లోని చాబాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజ లకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యా వుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివా సులు ఆదేశాలతో గ్రామ మాజీ సర్పంచ్ సి.ఎర్రిస్వామి నేతృత్వంలో గ్రామంలో ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ట్యాంకర్లతో నీటి అందిస్తున్నామని తెలిపారు. కాగా ట్యాంకర్లతో నీటిని అందిస్తుండటంవల్ల ఎంతో ఉపశమనం కలుగుతుందని ప్రజలు పేర్కొన్నారు.

# అందరూ కలిసికట్టుగా రాయదుర్గంను అభివృద్ధి చేసుకుందాం -ఎమ్మెల్యే కాలవ




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం రూరల్, అక్టోబర్ 05 ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పనిచేసి రాయదుర్గంను అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కార్యకర్తల సమావేశం నిర్వహించి ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు తీసుకునే నిర్ణయాలపై మీకు స్వేచ్ఛనిచ్చానని, ఆ స్వేచ్ఛను ఎవరూ దుర్వినియోగం చేసుకోకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యకర్తల మనోభావాలను ఎవరూ దెబ్బతీయకుండా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఎవరైనా తప్పుచేస్తే ఆ ప్రభావం నాపై పడుతుందని, కావునా ఎవరూ తప్పు చేయకూడదని, అందరూ కలిసికట్టుగా, నిజాయితీగా, నిర్వీరామంగా పనిచేద్దామని తెలిపారు. మన కార్యకర్తలను ఆదుకుందామని, ప్రజలను కాపాడుకుందామని, రాయదుర్గంను అభివృద్ధి చేసుకుందామని, ఇదే మనకు ప్రజలు ఇచ్చిన బాధ్యత అన్నారు. రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు ఎవరికి ఇవ్వని మెజార్టీ మనకు అందించారని దీనిని దృష్టిలో పెట్టుకొని మనం పనిచేయాలని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు నాతో సహా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, కానీ అన్ని కష్టాలకు ఎదురొడ్డి పోరాడామని, ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను ఎండకట్టామని ప్రజల ఆదరాభిమానాలు కూడా పొందామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఐఖ్యమత్యంగా కష్టపడ్డారని, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఎవరికీ రానటువంటి మెజార్టీ 42వేల మెజార్టీని తీసుకువచ్చారని, వీటనింటికి కారణం నాయకుల కలికట్టు తనం, కార్యకర్తల ఐఖ్యమత్యంతోనే ఇంత మెజార్టీ సాధించగలిగామన్నారు. ఇంత మెజార్టీ ప్రజలకు మనకు ఇచ్చారని కావున అందరూ మరింతంగా పనిచేయాలని, రాయదుర్గం అభివృద్ధిల్లో తగ్గేపశ్రక్తే లేదని ఆయన తెలిపారు. సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందామని డిఎస్ఏలు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ కన్వీనర్లు వీరందరూ కష్టపడి పనిచేయాలన్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాలు అరాచకమైన పరిపాలన, విధ్వషకరమైన పరిపాలన, అనాగరికమైన పరిపాలన సాగించాడన్నారు. ఆర్థిక విశ్వషానికి ఈ రాష్ట్రం భలైపోయిందని, రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబునాయుడు పరిపలన తీసుకున్నాడని, ఇన్ని కష్టాల్లో కూడా ధైర్యంగా ఒక్కటవ తేదీనే ఫించన్లు పంపిణీ చేస్తున్నామని, ఇంత డబ్బులను చంద్రబాబు ఎంతకష్టపడి పంపుతున్నాడో మనకు తెలియదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో 15వ తేదీ వచ్చినా ఉపాద్యాయులకు జీతాలు వచ్చేవికాదని, ఫించన్లు వచ్చేవికాదని, ఒక్కటవ తేదీ ఆదివారం అయితే 31వ తేదీనే ఫించన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దీంతో మీ మీ గ్రామాల్లో ప్రజల వద్ద నుండి నాయకులకు, కార్యక్తలకు గౌవరం పెరిగిందన్నారు. ప్రజలు మీ ముఖ్యమంత్రి బాగా పనిచేస్తున్నాడు, మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నాడని చెప్పుకునే పరిపాలన మరొక్కటి ఉండదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఇంతటి అభివృద్ధిని చేస్తున్నందున మనమందరం గర్వపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కల్పించండి

- జిల్లా సంయుక్త కలెక్టర్ అభిసేక్‌కుమార్




మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్

**పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 05, ప్రభాతవార్త**

ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను వేగవంతం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలునందు నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాను టిబి రహితంగా తీర్చిదిద్దాలని, వైద్య సిబ్బంది ఆశవర్కర్లు, ఎఎన్‌ఎంలు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తనకల్ల మండలంలో అధికంగా టిబి కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. జిల్లాలో మొత్తం 8 టిబియూనిట్లు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఈ యేడాది జనవరి నుండి సెప్టెంబర్ వరకు 1750 టిబి కేసులు నమోదైనట్లు తెలియజేశారు. జిల్లాలో ఎంత మంది టిబి అంబాసిడర్‌లు ఉన్నారో గుర్తించాలని, ఎంత మంది టిబి వ్యాధి గ్రస్తులకు హెచ్ఐవి, మధుమేహ పరీక్షలు నిర్వహించారో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, డిఎంహెచ్ఓ డా.మంజువాణి, డిఎల్ఎటిఓ డా.తిప్పయ్య, డా.రఘు, ఆర్‌డిటి ఆసుపత్రి సిబ్బంది, ఇతర ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులపై మొదలు కానున్న సామాజిక తనిఖీ

- 2023-24 మధ్య మండలంలో ఉపాధి పనులకు రూ.9.15 కోట్ల వ్యయం
- కూలీలకు రూ.5.90 కోట్లు, మెటీరియల్‌కు రూ.3.24 కోట్లు చెల్లింపులు
- 7న కో ఆర్డినేషన్ మీటింగ్ అనంతరం క్షేత్రస్థాయికు తనిఖీ బృందాలు




**ఉరవకొండ, అక్టోబర్ 5 ప్రభాతవార్త**

ఉరవకొండ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన 9,15,44,366 రూపాయలు విలువైన పనులపై సామాజిక తనిఖీ జరుగనుంది. ఇందుకోసం తనిఖీ బృందం స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మినారాయణ నేతృత్వంలో 12 మంది డీఆర్‌పీలు మండల పరిషత్ కార్యాలయం చేరుకున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీ ఉండగా అందులో కూలీలకు 5,90,95,274 రూపాయలు, మెటీరియల్‌కు 3,24,49,092 రూపాయలు ఖర్చు చేశారు. వెలిగొండ పంచాయతీలో 1,81,75,454 రూపాయల విలువైన పనులు జరుగగా కూలీలకు 25,24,922 రూపాయలు, మెటీరియల్‌కు 1,56,50,532 రూపాయలు ఖర్చు చేశారు. ఉరవకొండ పంచాయతీలో 1,38,02,283 రూపాయల విలువైన పనులు జరుగగా కూలీలకు 95,54,890 రూపాయలు, మెటీరియల్‌కు 42,47,393 రూపాయలు ఖర్చు చేశారు. ఆమిద్యాల పంచాయతీలో 66,46,954 రూపాయల విలువైన పనులు జరుగగా కూలీలకు 59,35,372 రూపాయలు, మెటీరియల్‌కు 7,11,582 రూపాయలు ఖర్చు చేశారు. రాకెట్ల పంచాయతీలో 54,92,315 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 33,50,573 రూపాయలు, మెటీరియల్‌కు 21,41,742 రూపాయలు ఖర్చు చేశారు. బూదగవి పంచాయతీలో 51,52,316 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 45,21,560 రూపాయలు, మెటీరియల్‌కు 6,30,756 రూపాయలు ఖర్చు చేశారు. చిన్నముష్టూరు పంచాయతీలో 49,85,072 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 37,27,905 రూపాయలు, 12,57,167 రూపాయలు ఖరు ్చ చేశారు. మోపిడి పంచాయతీలో 46,47,519 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 40,25,850 రూపాయలు, మెటీరియల్‌కు 6,21,669 రూపాయలు ఖర్చుచేశారు. రాయంపల్లి పంచాయతీలో 44,73,893 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 21,10,617 రూపాయలు, మెటీరియల్‌కు 23,63,276 రూపాయలు ఖర్చు చేశారు. నెరమెట్ల పంచాయతీలో 39,85,366 రూపాయలు విలులైన పనులు జరుగగా కూలీలకు 15,70,532 రూపాయలు, మెటీరియల్‌కు 24,14,834 రూపాయలు ఖర్చు చేశారు. లత్తవరం పంచాయతీలో 36,31,508 రూపాయల విలువైన పనులు జరుగగా కూలీలకు 31,00,987 రూపాయలు, మెటీరియల్‌కు 5,30,521 రూపాయలు ఖర్చు చేశారు. పెద్ద కౌకుంట్ల పంచాయతీలో 33,07,297 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 31,35,275 రూపాయలు, మెటీరియల్‌కు 1,72,022 రూపాయలు ఖర్చు చేశారు. నింబగల్లు పంచాయతీలో 32,53,485 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 22,24,909 రూపాయలు, మెటీరియల్‌కు 10,28,576 రూపాయలు ఖర్చుచేశారు. షేక్షానుపల్లి పంచాయతీలో 29,82,693 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 25,86,736 రూపాయలు, మెటీరియల్‌కు 3,95,957 రూపాయలు ఖర్చు చేశారు. వ్యాసాపురం పంచాయతీలో 29,60,098 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 29,34,298 రూపాయలు, మెటీరియల్‌కు 25,800 రూపాయలు ఖర్చు చేశారు. పెద్దముష్టూరు పంచాయతీలో 26,19,050 రూపాయలు విలులైన పనులు జరుగగా కూలీలకు 24,38,716 రూపాయలు, కూలీలకు 1,80,334 రూపాయలు ఖర్చు చేశారు. రేణుమాకులపల్లి పంచాయతీలో 21,19,768 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 21,11,668 రూపాయలు, మెటీరియల్‌కు 8,100 రూపాయలు ఖర్చు చేశారు. లత్తవరం తండా పంచాయతీలో 17,13,286 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 16,82,979 రూపాయలు, మెటీరియల్‌కు 30,307 రూపాయలు ఖర్చు చేశారు. ఇంద్రావతి పంచాయతీలో 15,96,009 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 15,57,485 రూపాయలు, మెటీరియల్‌కు 38,524 రూపాయలు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ లక్ష్మినారాయణ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తమకు ఇప్పటివరకు రికార్డు అందలేదని అందిన వెంటనే వాటిని పరిశీలించి క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు నిర్వహిస్తామన్నారు.